నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
I | హైదరాబాద్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | SIDDIPET

బైరాన్‌పల్లి బురుజును సందర్శించిన కేరళ బృందం

బురుజు వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 5: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని చారిత్రాత్మక బురుజును కేరళకు చెందిన సీపీఎం(ఎన్‌జీవో యూనియన్) బృందం సభ్యులు శనివారం సందర్శించారు. బురుజు వద్ద అమరవీరులకు ఘన నివాళులర్పించారు. రజాకార్లకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లి బురుజు కేంద్రంగా సాగిన నాటి పోరాట ఘట్టాలను సీపీఎం నాయకులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ పోరాటాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిగా నిలుస్తుందని, దొరలు, జాగిర్దార్లు, నైజాం రజాకార్లు, భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించినట్లు కేరళ సీపీఎం బృందం సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేశ్, పాలకుర్తి, చిల్పూరు మండలాల కార్యదర్శులు మాచర్ల సారయ్య, సౌదం రమేశ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు నాగేశ్వర్‌రావు, రాయల శ్రీనివాస్‌రావు, జక్కంపుడి కృష్ణ పాల్గొన్నారు.

ధరల మోత..కల్తీ కలవరం !

పండుగ పూట కల్తీ నూనెల విక్రయాలు

సిద్దిపేట (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/అందోల్, అక్టోబర్ 5 : వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని మార్కెట్‌లో కల్తీనూనెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల బ్రాండ్ల పేర్లతో.. రంగురంగుల ప్యాకెట్లతో అమ్ముతూ అడ్డగోలుగా సంపాదిస్తున్నారు. కల్తీలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మెదక్, నర్సాపూర్, జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణ్ ఖేడ్, సంగారెడ్డి పట్టణ కేంద్రాలు కల్తీ నూనెలకు కేంద్రాలుగా మారాయి. ఈ పట్టణాల్లో తయారుచేసిన కల్తీ నూనెలను ఆయా గ్రామాల్లోని కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇటీవల కాలంలో నూనెల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యాపారులు యథేచ్ఛగా కల్తీనూనెల విక్రయాలు చేస్తున్నారు. లీటర్‌పై రూ. 30 నుంచి రూ.50 వరకు ధర పెరగడంతో కల్తీ నూనెల వ్యాపారం జోరుగా సాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మార్కెట్‌లో నిత్యం 350 పైగా టన్నుల నూనెల విక్రయాలు జరుగుతున్నాయి. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 20శాతం మేర పెంచింది.దీంతో నూనెల ధరలు భగ్గుమంటున్నాయి. జిల్లాలో పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు విస్తీర్ణం తగ్గుతున్నది. బయట ప్రాంతాల నుంచి జిల్లాకు నూనెలు దిగుమతి అవుతున్నాయి. చాలావరకు నూనెలు నాసిరకం ఉంటున్నాయి. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్‌లోకి వచ్చిన వాటిలో నాసిరకం ఎక్కువగా ఉంటున్నాయి. అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నాసిరకం నూనెల వాడకం ప్రజారోగ్యంపై ప్రభావాన్ని చూపుతున్నది.

ప్రజారోగ్యంపై ప్రభావం...

కల్తీ వంట నూనెల వాడకంతో తల తిప్పడం, కడుపు నొప్పి, వికారం, విరేచనాలు, కడుపులో మంట, చర్మంపై దుద్దర్లు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తి వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వంట నూనెలు కల్తీ కావడంతోనే ఇలా జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి లైసెన్స్‌లు లేకున్నా బహిరంగ మార్కెట్‌లో విడినూనెలు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఇవేమీ పట్టడం లేదు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి వీటిని మరిచి పోతున్నారని, ప్రతినెలా నూనెల తయారీ కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ వాటివైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నాణ్యమైన నూనెల విక్రయాలు, ధరల నియంత్రణ, జీరో వ్యాపారాన్ని అరికట్టడంలో అధికారుల మధ్యన సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఇది వ్యాపారులకు కలిసి వస్తున్నది. సహజంగా ఒక వ్యాపారి ఇంత నూనె నిల్వ చేసుకోవాలని ఉంటుంది. అంత కన్నా ఎక్కువ నిల్వ చేసుకుంటే పౌరసరఫరాల శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. హోల్‌సేల్ వ్యాపారులు 600 క్వింటాళ్ల వరకు, ఇతర ప్రాంతాల్లో 350 క్వింటాళ్ల వరకు,జిల్లా కేంద్రంలో రిటైల్ వ్యాపారి 50 క్వింటాళ్ల వరకు, ఇతర ప్రాంతాల్లో 30 క్వింటాళ్ల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఇవి నిబంధనలు. కానీ, ఇవేవి అమలు కావడం లేదు. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నూనెల నిల్వలు ఉంచుతున్నారు. అనుమతి లేని నూనెల నిల్వ కేంద్రాలు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిపై కనీసం అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కల్తీ వ్యాపారాన్ని అరికట్టడంలో ఫుడ్, పౌర, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో వెళ్తేనే కల్తీలకు చెక్ పడుతుంది.

- ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగుతున్న దందా
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- అధికారుల చర్యలు శూన్యం
- పెరిగిన ధరలతో యథేచ్ఛగా కల్తీ విక్రయాలు
- పాత స్టాక్‌పై అధిక రేటు వసూలు
- పండుగల సమయం కావడంతో భారీగా డిమాండ్

ఇష్టారీతిగా ధరల పెంపు

ఇష్టారీతిన వంట నూనెల ధరలను పెంచడంతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్, పల్లి, నువ్వుల నూనెలు మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముతున్నారు. మధ్యతరగతి ప్రజలు వినియోగించే పామాయిల్ లీటరు ప్యాకెట్‌పై రూ. 30 వరకు ధర పెరిగింది. సన్ ఫ్లవర్ ధర అంతే పెరిగింది. ప్రభుత్వం సుంకం విధింపును సాకుగా చూపి వంట నూనెల ధరలు పెంచితే ప్రైవేట్ ఆయిల్ కంపెనీల ఇంకా ఎక్కువగా పెంచుతున్నాయి. ధరలు పెరిగి పోతుండడంతో కృత్రిమ కొరతను సృష్టించి డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. వంట నూనెల ధరలు అమాంతం పెరుగుతుండడంతో పాత స్టాక్‌ను బ్లాక్ చేసి వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రవాణా చార్జీలు పెరగడం, ముడిసరుకు కొరత...ఇతరత్రా కారణాలతో నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లో లీటర్ ఆయిల్ ప్యాకెట్ ధరలు రూ.25 నుంచి 35 వరకు పెరిగాయి. దీంతో మధ్యతరగతి, రోజువారీ కూలీ, పనులకు వెళ్లే వారు ధరల పెరుగుదలతో ఆందోళన చెందుతున్నారు. పాత స్టాక్‌ను బ్లాక్ చేసిన వ్యాపారులు దుకాణాల వద్ద నోస్టాక్ బోర్డులు పెట్టి పాత ప్యాకెట్లనే ఎంఆర్‌పీపై రూ. 30 నుంచి రూ40 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. వారం క్రితం 15 లీటర్ల ఆయిల్ డబ్బా రూ.1400 నుంచి 1500 మధ్యనుండగా, ఇప్పుడు రూ.2000- 2200పైగా ఉన్నది. లీటరు ఆయిల్ ప్యాకెట్ సైతం రూ.110-115 ఉండగా, కొన్ని రోజులుగా రూ.రూ. 125 నుంచి రూ.135 వరకు చేరుకుంది. నూనె ధరలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతుండగా.. ఇదే సమయంలో హోటళ్ల నిర్వాహకులకు ఆర్థికంగా భారం పడుతున్నది. వీటితోపాటు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు కూడా అమాంతం పెరగడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధిక ధరలను నియంత్రించాని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పండుగలతో డిమాండ్ పెరిగింది

రెండు వారాలుగా వంట నూనెల ధరలు బాగా పెరుగుతున్నాయి. డిమాండ్ పెరగడం, సరఫరా తగ్గడం ముఖ్యకారణం. దీంతో ఆయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. నెలలో నూనెల ధర లీటర్‌కు రూ.25 నుంచి 35 వరకు వరకు పెరిగాయి. ముందు ముందు ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– సుక్కుబాబు, కిరాణా వ్యాపారి, అందోల్

భారం పడుతున్నది..

నెల రోజులుగా నూనెల ధరలు బాగా పెరుగుతున్నయి. లీటర్ ప్యాకెట్‌పై రూ.35 వరకు ధర పెరిగింది. ధరలు ఇలానే ఉంటే మా లాంటి ఎలా బతకాలి. అన్ని ధరలు పెరగుతున్నయి. మాలాంటి పేద కుటుంబాలపై ఆర్థికభారం పడుతున్నది. పండుగల సమయంలో ధరలు పెరగడంతో మరింత ఇబ్బందులు పడుతున్నాం. సర్కారోళ్లు పట్టించుకోవాలి.

– లక్ష్మి, గృహిణి, సంగుపేట, అందోల్ మండలం

ముత్తంగిలో చెత్త తొలిగింపు

ముత్తంగిలో చెత్తను ఎత్తేసిన తర్వాత శుభ్రంగా మారిన ఐడీఏ లింక్‌రోడ్డు

పటాన్‌చెరు, అక్టోబర్ 5 : ముత్తంగిలో చెత్త' శుద్ధి' ఏదీ అని తెల్లాపూర్ మున్సిపాలిటీ నిర్లక్ష్యంపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి చర్యలకు దిగారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఈఈ సాయి మౌనిక, డీఈ సత్యనారాయణ ఆధ్వర్యంలో చెత్తను తొలిగించారు. భారీగా పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో ఎత్తివేసి టిప్పర్ల ద్వారా యుద్ధ ప్రాతిపాదికన కొల్లూరు డంప్ యార్డుకు తరలించారు. గుంతను సైతం చదును చేయిస్తున్నారు.మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ప్రత్యేక వివరణ ఇచ్చారు. ముత్తంగి గ్రామ పరిధిలో ఐడీఏ రోడ్డుపై డంప్‌చేసిన చెత్తను రోడ్డుపై నుంచి ప్రత్యేకంగా తొలిగించి, శుభ్రం చేసినట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో చెత్తను ఎవరూ డంప్ చేయకుండా, ఇలాంటి పరిస్థితి తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముత్తంగిని శుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో మున్సిపల్ అధికారులు పరిసరాలను శుభ్రం చేయడంపై ప్రజలు పత్రికను అభినందించారు. చెత్త సమస్యకు పరిష్కారం చూపారని సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపించారు. స్థానికుల స్టేటస్‌లలో ఇదే ప్రధానాంశం కావడం విశేషం.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్కల్, అక్టోబర్ 5: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు శనివారం వరద కొనసాగడంతో రెండు గేట్లు ఎత్తి దిగువకు 16,284 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విద్యుదుత్పత్తి కోసం జెన్కోకు 2823 క్యూసెక్కులు విడుదల చేశారు. 14168 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో , 19107 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు రాగా, 29.678 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు.

తప్పులు లేకుండా సమాచారం సేకరించాలి

ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన

సిద్దిపేట/గజ్వేల్, అక్టోబర్ 5: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి తప్పులు లేకుండా సమాచారం సేకరించాలని రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన సూచించారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని 34వ వార్డులో కలెక్టర్ మనుచౌదరితో కలిసి అధికారులు నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే చేస్తున్నప్పుడు కుదిరితేనే కుటుంబ సభ్యుల గ్రూపు ఫొటోలు తీసుకోవాలన్నారు. సర్వేను వేగంగా, పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. అనంతరం హోటల్ మినర్వాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు.

సిద్దిపేట పట్టణంలోని 34వ వార్డులో సర్వేను పరిశీలిస్తున్న రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన

గజ్వేల్‌లోని 17వ వార్డులో సర్వే వివరాలు తెలుసుకుంటున్న సీఎంవో జాయింట్ సెక్రటరీ సంగీత, కలెక్టర్ మనుచౌదరి

పారదర్శకంగా సర్వే చేయాలి : సంగీత

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఎంవో జాయింట్ సెక్రటరీ సంగీత అధికారులకు సూచించారు. శనివారం గజ్వేల్ మున్సిపల్‌లోని 17 వార్డులో చేపడుతున్న సర్వేను కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండాలన్నారు. ఏ ఒక్క ఇంటిని మర్చిపోకుండా సర్వే చేయాలన్నారు. ఈ సర్వే 8వ తేదీ వరకు కొనసాగుతుందని, ఇప్పటివరకు 80శాతం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ శ్రవణ్, కమిషనర్ నర్సయ్య, ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.


సంగారెడ్డి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 చొప్పున మద్దతు ధర చెల్లించడంతోపాటు సన్న రకానికి ప్రభుత్వం అదనంగా రూ.500 చొప్పున బోనస్ అందించనున్నదని తెలిపారు. జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున, అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమన్వయంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

గురువు చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 5: విద్యార్థులను దేశం గర్వించేలా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని పోతిరెడ్డిపల్లి పీఎస్‌ఆర్ గార్డెన్‌లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 150 మంది ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పురస్కారాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆరోగ్యం బాగలేకున్నా తనను నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, హక్కుల సాధనలో న్యాయపరమైన కోరికలు, చట్టపరమైనవి ఇవ్వాల్సిందేనని, హక్కుల విషయంలో ఉపాధ్యాయుల వెంట ఉండి హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, సురేందర్, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, విశ్రాంత ఎంఈవో వెంకటేశం, అంజయ్య, వివిధ సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కాళీమాత ఆశ్రమంలో పూజలు చేస్తున్న బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి

మద్దూరు(ధూళిమిట్ట),అక్టోబర్ 5: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ, బోనాల పండుగలు నిలుస్తాయని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ కాళీమాత ఆశ్రమాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. అంతకు ముందు బాలలక్ష్మి పరమయోగిని కాళీమాత(తల్లి) ఆశీస్సులను తీసుకున్నారు. బాలలక్ష్మికి ఆశ్రమ నిర్వాహకులు గుర్రం నారాయణ కాళీమాత చిత్రపటాన్ని అందించి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజయ్‌కుమార్, ఏఎస్సై విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్, కనకచంద్రం, సుంకోజు శ్రీశైలం, కేశపురం ఆంజనేయులు, మేక శ్రీనివాస్, గంగాధర్, ప్రశాంత్, పుల్లూరి రాజు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి (ఇన్‌సెట్‌లో) బతుకమ్మను తీసుకొస్తున్న కలెక్టర్

బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: సంగారెడ్డి జిల్లా సమైఖ్య ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని జిల్లా సమైక్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ, కొలాటం ఆటలు ఆడుతూ ఉద్యోగులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మహిళా అధికారులు, ఏపీడీలు, ఏపీవోలు, జిల్లా మహిళా శక్తి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలోని టీఎన్‌జీవో ప్రాంగణంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఉద్యోగులు

రామ రామ ఉయ్యాలో...

సిద్దిపేట పట్టణంలో శనివారం బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో, సిద్దిపేట టీఎన్జీవోస్ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఉత్సవాల్లో జిల్లా జడ్జి రమాదేవి, న్యాయమూర్తులు, లాయర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం నీటి వనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పాటలు పడి సందడి చేశారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 5

సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న జిల్లా జడ్జి రమాదేవి, న్యాయవాదులు

సిద్దిపేట 23వార్డులో ఓంశ్రీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మలతో మహిళలు

బతుకమ్మతో జిల్లా జడ్జి రమాదేవి


సిద్దిపేటలోని టీఎన్‌జీవో ప్రాంగణంలో బతుకమ్మలతో వస్తున్న ఉద్యోగులు